క్లుప్తంగా

ఘనంగా గ్రామదేవత జాతర


ప్రత్యేక అలంకరణలో మరిడి మహాలక్ష్మి అమ్మవారు

ఉప్పలగుప్తం: మండంలోని చల్లపల్లిలో వేంచేసి ఉన్న గ్రామ దేవత మరిడి మహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

విజేతలకు బహుమతుల అందజేత


కొమరిగిరిపట్నంలో మండల స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఎంపీడీవో కృష్ణమోహన్

అల్లవరం: మండలంలోని కొమరిగిరిపట్నంలో జరిగిన మండల స్థాయి ఆడుదాం ఆంధ్రాలో ప్రతిభను చాటి వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం బహుమతులు అందజేసినట్టు ఎంపీడీవో కృష్ణమోహన్ తెలిపారు. బెండమూర్లంక బాలురు, దేవగుప్తం బాలికల జట్లు వాలీబాల్, ఎస్.పల్లిపాలెం బాలురు, కొమరిగిరిపట్నం-1 బాలికల జట్లు కబడ్డీ, అల్లవరం-2 బాలురు, ఎంట్రికోన బాలికల జట్లు కోకో, అల్లవరం-1 బాలురు, అల్లవరం-2 బాలికల జట్లు బ్యాడ్మింటన్, కొమ్మరిగిరిపట్నం-3 బాలురు, కొమరిగిరిపట్నం-1 బాలికల జట్లు ఎంపికైనట్లు ఎంపీడీవో కృష్ణమోహన్ వివరించారు. వీరంతా ఈ నెల 24 నుంచి అమలాపురంలో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఎస్ఈబీ కొత్త సీఐగా సాయి స్వరూప్

అమలాపురం టౌన్: అమలాపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సీఐ వేగిశ్న శివరామరాజు కృష్ణా జిల్లా ముప్వ ఎస్ఈబీ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయన బదిలీ అనివార్యమైంది. ఆయన స్థానంలో అమలాపురం ఎస్ఈబీ సీఐగా పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి ఎస్ఈబీ సీఐ సాయిస్వరూప్ ఇక్కడకు రానున్నారు. శివరామరాజు ఇక్కడ నుంచి రిలీవ్ అయి ఆదివారం ఉదయమే ముప్వ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. సాయి స్వరూప్ అమలాపురానికి సోమవారం వచ్చి సీఐగా బాధ్యతలు స్వీకరించనున్నారు. అమలాపురం ఎస్ఈబీ సీఐగా శివరామరాజు పాండిచ్చేరి యానాం నుంచి అక్రమంగా దిగుమతి అయ్యే ఎన్డీపీ మద్యాన్ని పలు సందర్భాల్లో పెద్ద ఎత్తున పట్టుకోవడమే కాకుండా నాటుసారా బట్టీలపై కూడా దాడులు చేసి ఎస్ఈబీ పరిధిలో వాటి నిర్మూలనకు కృషి చేశారు.

నూతన కార్యవర్గం నియామకం

ముమ్మిడివరం: జిల్లా వ్యవసాయాధికారుల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ముమ్మిడివరంలో రాష్ట్ర వ్యవసాయాధికారుల సంఘం అధ్యక్షుడు కె.బాలభాస్కర్, జనరల్ సెక్రటరీ డి.ప్రవీణ్, ట్రెజరర్ మురళీ కృష్ణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా వ్యవసాయాధికారుల సంఘం అధ్యక్షుడిగా కాకి నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా ఎస్.రాజేష్, ట్రెజరర్‌గా కె.సునీత, ఉపాధ్యక్షుడిగా కె.ప్రభాకర్, జాయింట్ సెక్రటరీగా ఎన్వీవీ సత్యనారాయణలు నియమితులయ్యారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె.బోస్‌బాబు, జిల్లాలోని వ్యవసాయాధికారులు, సహాయ సంచాలకులు పాల్గొన్నారు.

విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడిగా ఏడుకొండలు


వడ్డి ఏడుకొండలు

తాళ్లరేవు: విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడిగా వడ్డి ఏడుకొండలు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం బీవీ రమణయ్య మెమోరియల్ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో కళామండలి వ్యవస్థాపకుడు మాస్టర్‌జీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కోకన్వీనర్‌గా ఎడ్ల సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా దాసరి ఆదినారాయణ, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా మెండి కమల, గిడ్ల వీరప్రసాద్, షర్మిళ, మేకల మీరాసాహెబ్, సోడదాది జైపాల్ తదితరులను ఎంపిక చేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపికైన వడ్డి ఏడుకొండలును ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, టేకుమూడి ఈశ్వరరావు, యడ్ల కుటుంబరావు, వాకపల్లి చిరంజీవి, విప్పర్తి శ్రీను అభినందించారు.

అక్రమ మద్యం పట్టివేత

కాట్రేనికోన: మండలంలోని బలుసుతిప్పలో పోలీసులు జరిపిన ఆకస్మిక దాడిలో 27 కేసుల అక్రమ మద్యాన్ని పట్టుకున్నారు. ట్రైనీ డీఎస్పీ వల్లెం విష్ణుస్వరూప్ ఆధ్వర్యంలో కాట్రేనికోన ఎస్ఐ నాగేశ్వరరావు, పోలీస్ సిబ్బంది బలుసుతిప్పలో మద్యం నిల్వ ఉంచిన బోటును గుర్తించి మద్యం స్వాధీనం చేసుకున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామ రామ రఘు రామ

- బాలరాముని ప్రతిష్ఠ వేడుకకు రామాలయాల ముస్తాబు
- శోభా యాత్రలతో ఊరూరా పండగ వాతారణం


రామాలయాన్ని శుభ్రం చేస్తున్న అల్లవరం మండలం బెండమూర్లంక గ్రామస్తులు


అమలాపురంలో ఇంటింటికీ అక్షతలు పంచిపెడుతూ శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా పల్లె, పట్టణమన్న తేడా లేకుండా రామనామస్మరణతో మార్మోగుతున్నాయి. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని 127 గ్రామాల్లో శోభాయాత్రలు, అయోధ్య రాముని అక్షతల ఇంటింటి పంపిణీతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అయోధ్యలోని నూతనంగా నిర్మించిన శ్రీరామ మందిరంలో సోమవారం జరిగే వేడుక సందర్భంగా ఇప్పటికే విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్ తదితర ఆధ్యాత్మిక సంస్థలు సోమవారం ఇంటింటా నిర్వహణకు పిలుపునిచ్చాయి. రెండు నియోజకర్గాల్లో ఉన్న దాదాపు 155 రామాలయాల్లో వేడుక జరగనుంది. సామూహిక శ్రీరామ జపం, హనుమాన్ చాలీసా, శోభాయాత్రలు సోమవారం నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం గత రెండు రోజులుగా తమ తమ ఇళ్లనే కాదు గ్రామాల్లోని రామాలయాలను శుభ్రం చేసి ముస్తాబు చేస్తున్నారు.
అల్లవరం మండలం బెండమూర్లంకలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు రామాలయాలను శుభ్రం చేసి ముస్తాబు చేశారు. సోమవారం మధ్యాహ్నం రామాలయాల వద్ద గ్రామస్తులు సామూహిక అన్న సమారాధన ఏర్పాట్లు చేసుకున్నారు. అందరూ శ్రీరాముడిని కొలుస్తూ ఆత్మీయ, ఆధ్యాత్మిక వాతావరణంలో హిందువుల ఐక్యతను చాటేలా అన్న సమారాధన చేయనున్నారు. భీమనపల్లి, విలసవల్లి, నడిపూడి తదితర గ్రామాల్లోనూ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో రామాలయాల వద్ద సప్తాహాలు, ఏకాహం వంటి భజనలు చేపడుతున్నారు. విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్‌కు చెందిన మహిళలు ఇంటింటికీ వెళ్లి గృహిణుల నుదుట కుంకుమ బొట్టు పెట్టి, అక్షతలు ఇచ్చి సోమవారం చేపటాల్సిన విధానాల గురించి కరపత్రాలను అందిస్తున్నారు. డోలు సన్నాయితో ఏదో పెళ్లి బృందం వెళ్లి అహ్వానిస్తున్నట్లుగా అయోధ్య ఆహ్వాన పత్రాలను కూడా అందిస్తున్నారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ అయోధ్యలో జరిగే క్రతువు సందర్భంగా అమలాపురం, ముమ్మిడివరంతో పాటు పలు గ్రామాల్లో శోభయాత్రలు, శ్రీరామ నామ జపాలు, శ్రీరామ పట్టాభిషేకం వంటి పూజా ప్రక్రియలు చేస్తున్నారు. ఈ శోభాయాత్రలో భక్తులు శుభ కలశాలతో హాజరుకానున్నారు. సాయంత్రం ఇళ్లు, రామాలయాల వద్ద దీపాలు వెలిగించనున్నారు. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకోనున్నారు.

> **హిందువుల ఐక్యత సాకారమవుతోంది**
> గత నెల రోజులుగా గ్రామగ్రామాన తిరిగి అయోధ్య రాముని అక్షతలు అందజేస్తున్నాం. అయోధ్యలో జరిగే బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా జరిగే ఆధ్యాత్మిక క్రతువును చూసేందుకు హిందువులందరూ వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. నేరుగా వెళ్లలేకపోయినా టీవీలు, సామాజిక మాధ్యమాల్లో చూసేందుకు తహతహలాడుతున్నారు. అయోధ్య ఆధ్యాత్మిక వేడుక ద్వారా పట్టణాలు, గ్రామాల్లో హిందువుల ఐక్యత సాకారమవుతోంది.
> – శిరంగు నాయుడు, రాష్ట్ర సహ కన్వీనర్, బజరంగ్‌దళ్

సెలవు రోజున పనిచేసిన రైల్వే రిజర్వేషన్ కౌంటర్


ఆదివారం పనిచేస్తున్న అమలాపురం ప్రధాన తపాలా కార్యాలయంలోని రైల్వే రిజర్వేషన్ కౌంటర్

అమలాపురం టౌన్: అమలాపురం ఎంపీ చింతా అనురాధ చొరవతో స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో ఆదివారం సెలవు రోజైనా రైల్వే రిజర్వేషన్ కౌంటర్ పనిచేసింది. గతంలో స్థానిక సర్క్యులర్ బజార్‌లో ఉన్న ఇదే రిజర్వేషన్ కౌంటర్ ఆదివారం కూడా సేవలు అందించేది. ఈ కౌంటర్‌ను ప్రధాన తపాలా కార్యాలయానికి మార్చిన తర్వాత ఆ వెసులుబాటు లేకుండాపోయింది. ఎంపీ అనురాధ తపాలా శాఖ ఉన్నతాధికారులతో చర్చించి ఆదివారం రోజున కూడా తపాలా కార్యాలయంలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో రైల్వే టిక్కెట్ల వినియోగదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకున్నారు. కోనసీమ రైల్వే సాధన సమతి అధ్యక్షుడు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం ఈ మార్పుపై హర్షం వ్యక్తం చేశారు.

రామ్మూర్తికి ఘన నివాళి


రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర, జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: విశ్వ బ్రాహ్మణ పితామహుడు, ఉమ్మడి మద్రాసు రాష్ట్రం మాజీ ఎమ్మెల్సీ గానాల రామ్మూర్తి 132వ జయంతి వేడుకలు స్థానిక గోల్డ్ మార్కెట్‌లో విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. గానాల రామ్మూర్తి చిత్రపటానికి విశ్వ బ్రాహ్మణ సంఘ పెద్దలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 50 మంది విశ్వ బ్రాహ్మణ పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. మద్రాసు ఉమ్మడి రాష్ట్రంలో ఓసీలుగా ఉన్న విశ్వ బ్రాహ్మణులను బీసీ-బి కేటగిరిలోకి మార్చడానికి రామ్మూర్తి చట్టసభలో తన గళాన్ని వినిపించారని రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు ఆవుపాటి వేణుగోపాల్ అన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు కోసూరి చిదంబరాచారి, చేబ్రోలు గంగా నాగేశ్వరరావు, వరద సత్యనారాయణ, కట్టోజు వెంకట సుబ్బారావు, ఓడూరి కిరణ్‌కుమార్, లక్కోజు ప్రసాద్, బొల్లోజు మణి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నామస్మరణతో పాదయాత్ర


అమలాపురంలో శ్రీరామ నామస్మరణతో పాదయాత్ర నిర్వహిస్తున్న వివిధ వ్యాపార సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అమలాపురం పురవీధుల్లో పలు సంఘాల నాయకులు, భక్తులు శ్రీరామ నామస్మరణతో ఆదివారం సాయంత్రం పాదయాత్ర నిర్వహించారు. ది చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పాదయాత్ర స్థానిక ఆర్టీసీ బస్ స్టేషన్ నుంచి గడియారం స్తంభం సెంటరు వరకూ సాగింది. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యవస్థాపకుడు గోకరకొండ హరిబాబు, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, కోశాధికారి దొమ్మేటి సాయిబాబు, బీజేపీ యువ మోర్చ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, చింతలపూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షతల పంపిణీ

అమలాపురం రూరల్: మండలంలోని నడిపూడిలో అయోధ్య రాముడి అక్షతలను ఆదివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షతలకు గ్రామంలోని పట్టాభిరామ స్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం రథంపై ఊరేగింపుగా వెళ్లి గ్రామంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. సోమవారం అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఇంటింటా దీపాలు వెలిగించి అక్షతలను దేవుని వద్ద ఉంచి కుటుంబ సభ్యులపై చల్లాలని సూచించారు. కార్యక్రమంలో రంకిరెడ్డి రామలింగేశ్వరరావు, అరిగెల సుబ్బరాజు, కుంపట్ల నాయుడు, అరిగెల శేషగిరిరావు, అరిగెల రాజారావు, అరిగెల బాబులు, అరిగెల ఆంజనేయులు, మద్దాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
మండలంలోని చిందాడగరువులో సామాజిక కార్యకర్త మోటూరి వెంకటేశ్వరరావు దంపతులు అయోధ్య రాముని అక్షతలను ఇంటింటికీ పంచిపెట్టారు.

తాళ్లరేవు: అయోధ్యరాముని అక్షతలతో గాడిమొగలో ఆదివారం ఉత్సాహంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు సీతారామ లక్ష్మణ హనుమ వేషాలు వేసి ఆకట్టుకున్నారు. స్థానిక నాయకులు కె.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామభక్త బృందం ర్యాలీ

యానాం: అయోధ్యలో సోమవారం జరగనున్న ఆధ్యాత్మిక వేడుకను పురస్కరించుకుని ఆదివారం శ్రీరామభక్త బృందం నియోజకవర్గ పరిధిలోని అన్ని రామాలయాల కమిటీల ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించింది. పట్టణ పరిధిలోని చింతావారివీధిలో కోదండ రామాలయం వద్ద నుంచి ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ర్యాలీ యానాం, కురసాంపేట, పరంపేట, దరియాలతిప్ప, గిరియాంపేట, సావిత్రినగర్ తదితర ప్రాంతాల మీదుగా సాగింది. ర్యాలీలో ఆర్ఏఓ మునిస్వామి, నల్లా వెంకన్న, పులవర్తి శ్రీను, గాజుల బ్రహ్మనందం తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షతలతో ఊరేగింపు

కాట్రేనికోన: మండలంలోని కుండలేశ్వరం, కాట్రేనికోన గ్రామాల్లో అయోధ్య రాముడి అక్షతలను భక్తులు ఊరేగించారు. పార్వతీ సమేత కుండలేశ్వర స్వామి ఆలయ అర్చకులు కాళ్ళకూరి కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి అక్షతలను పంచిపెట్టారు.


నడిపూడిలో అయోధ్య రాముడి అక్షతలను ఊరేగిస్తున్న భక్తులు


గాడిమొగలో సీతారామ లక్ష్మణ హనుమ వేషధారణలో చిన్నారులు


ర్యాలీలో పాల్గొన్న ఆర్ఏఓ మునిస్వామి తదితరులు

కొత్తూరు-వెదురుమూడి రోడ్డులో ట్రాఫిక్‌జామ్


ఓఎన్జీసీ వాహనాల రాకపోకల వల్ల పినపళ్ల వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

ఆలమూరు: ఓఎన్జీసీ భారీ వాహనాల రాకపోకల వల్ల కొత్తూరు-వెదురుమూడి రోడ్డులోని పినపళ్ల వద్ద ఆదివారం సుమారు గంట సేపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇటీవల పంట కాలువలో తీసిన పూడికను రహదారి పక్కన ఉంచడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో పాటు కపిలేశ్వరపురం మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓఎన్జీసీ రిగ్‌లకు చెందిన యంత్రాలను భారీ వాహనంలో తరలిస్తున్నారు. అసలే ఇరుకురోడ్డు కావడంతో ఆ భారీ పొడుగు వాహనాల ధాటికి మిగతా వాహనాలు తప్పించుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఈ రహదారి వెంబడి అనునిత్యం ఓఎన్జీసీకి చెందిన అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై వాహనదారులు ఆవేదన చెందుతున్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర


వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సర్పంచ్ నూకరాజు తదితరులు

తాళ్లరేవు: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం పోలేకుర్రు పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ వెంటపల్లి నూకరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నూకరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని, వాటిని ప్రజలందరికీ తెలియజేసేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధ, ఎంపీటీసీ సభ్యురాలు బళ్ల సంధ్యారాణి, కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, ఎంఈఓ మోకా ఉమ, వెటర్నరీ వైద్యురాలు దవులూరి సుధ, వికసిత్ భారత్ జిల్లా కో ఆర్డినేటర్ పుట్టా వీరప్రసాద్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

సీఐ క్రిస్టోఫర్‌ను కలిసిన వ్యాపారుల బృందం


పట్టణ సీఐ క్రిస్టోఫర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపారుల బృందం

అమలాపురం టౌన్: పట్టణ సీఐగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన క్రిస్టోఫర్‌ను పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన పలు వ్యాపార సంఘాల ప్రతినిధులు ఆదివారం రాత్రి స్థానిక సీఐ కార్యాయలంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలో లా అండ్ ఆర్డర్ విషయంలో వ్యాపార సంఘాలు పోలీసులకు సహకరించాలని సీఐ క్రిస్టోఫర్ కోరారు. పోలీసులకు వ్యాపారులు ఎప్పుడూ సహకరించేందుకు సిద్ధంగా ఉంటారని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో చాంబర్ ప్రధాన కార్యదర్శి యెండూరి నాగేశ్వరరావు, కోశాధికారి కర్రెళ్ల రమేష్‌బాబు, ఉపాధ్యక్షులు దొంగ రాంబాబు, కుప్పాల రామకృష్ణ, కట్టోజు సన్నయ్యదాసు, దండమేను రూపేష్, సంగినీడి బాబులు తదితరులు సీఐని కలిసి అభినందించారు. సీఐ క్రిస్టోఫర్‌ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాకపల్లి స్వామినాయుడు కూడా లారీ ఓనర్స్ తరపున మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

చదువులమ్మ చెట్టు నీడలో..


సఖినేటిపల్లి సీఎంఎల్ కళాశాలలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



రాజోలు యూత్ క్లబ్ ఆవరణలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎస్ఎస్‌సీ మొదటి బ్యాచ్ విద్యార్థులు

సఖినేటిపల్లి: స్థానిక సీఎంఎల్ కళాశాలలో ఆదివారం 2003-05 బ్యాచ్ ఇంటర్మీడియెట్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చదువులమ్మ చెట్టు నీడన చదువుకున్న వారంతా అదే కళాశాలలో కలుసుకుని ఆనంద పరవశులయ్యారు. ఆటపాటలతో ఉత్సాహంగా, ఉల్లాసంగా రోజంతా గడిపారు. అలనాటి మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. ఒకరికొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆర్థిక అవసరాల నిమిత్తం ఓ విద్యార్థినికి వారంతా కలిపి కొంత నగదు విరాళంగా అందజేశారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఓగూరి టాండన్‌రాజు, లెక్చరర్ నల్లి రాహేల్‌బాబు, సూపరింటెండెంట్ ఎన్.నరసయ్యలను పుష్పగుచ్ఛాలతో అభినందించారు. అలాగే పాఠాలు నేర్పిన నాటి గురువులను కూడా సత్కరించారు. ఇదిలా ఉండగా పూర్వ విద్యార్థులు ఎస్.సూర్యజ్యోతి, సీహెచ్ రమేష్, ఎన్.సురేష్ కళాశాలలో అడ్మిషన్లకు తగిన కృషి చేస్తున్నట్టు యాజమాన్యం తెలిపింది.

రాజోలు: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం మొదటి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రాజోలు యూత్ క్లబ్ ఆవరణలో 1969లో ఎస్ఎస్‌సీ మొదటి బ్యాచ్‌కు చెందిన స్నేహితులంతా బందా సూర్యనారాయణ చొరవతో ఒక చోట సమావేశమయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సూర్యనారాయణ మాట్లాడుతూ, తమ బ్యాచ్‌కి పదో తరగతి పూర్తై సుమారు 55 సంవత్సరాలు అయిందన్నారు. తామంతా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులుగా, రాజకీయ, వ్యాపార వేత్తలుగా స్థిరపడ్డామని తెలిపారు. మరో పూర్వ విద్యార్థి కోళ్ల వెంకన్న మాట్లాడుతూ, సంక్రాంతి పండగ పురస్కరించుకుని మద్రాసు, తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో స్థిరపడిన స్నేహితులంతా ఏటా ఒక చోట కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. బిళ్ల కోట సోమేశ్వరరావు స్నేహితులకు ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఎన్.మాధవరావు, మాదాసు మోహనరావు, ఎస్.అచ్యుత రామనాగేశ్వరరావు, నైనాల సీతా రామారావు, టీవీఎస్ కృష్ణ, అంగర సత్యనారాయణ పాల్గొన్నారు.


ఆలమూరులోని బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థినులు

ఆలమూరు: 22 ఏళ్ల తరువాత నాటి విద్యార్థినులు కలుసుకున్న దృశ్యం ఆదివారం స్థానికులకు కనువిందు చేసింది. ప్రస్తుతం అనుభవిస్తున్న హోదాను, చేస్తున్న ఉన్నత ఉద్యోగాలను మరచి ఒకరికొకరు తమ అనుభవాలను పంచుకున్నారు. ఆలమూరులోని బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఈ దృశ్యాలు కనువిందు చేశాయి. స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో 2002 బ్యాచ్‌కు చెందిన సుమారు 19 మంది విద్యార్థులు పాల్గొని గత స్మృతులను నెమరువేసుకున్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన నాటి విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను, చేసిన చిలిపి అల్లరిని గుర్తు చేసుకుని ప్రస్తుతం చేస్తున్న వృత్తి, ఉద్యోగాలను, వ్యాపారాలను వివరించారు. కొంత మంది విద్యార్థులు సమ్మేళనంలో ప్రసంగిస్తూ ఉద్వేగభరితులయ్యారు. అనంతరం విద్యాబుద్ధులను చెప్పిన నాటి గురువులు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. రెండున్నర దశాబ్దాల క్రితం పాఠశాలను విడిచి వెళ్లిపోయిన విద్యార్థులందరికి ఒకే వేదికపై తీసుకువచ్చిన కమిటీ సభ్యులను గురువులు అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో పేదలకు మేలు

మామిడికుదురు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా, బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్ పేర్కొన్నారు. పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర సమావేశాలు ఆదివారం మండలంలోని పెదపట్నం, అప్పనపల్లి, బి.దొడ్డవరం గ్రామాల్లో జరిగాయి. విశ్వకర్మ యోజన పథకంతో పాటు ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు ప్రజలకు ఎంతో అండగా నిలుస్తున్నాయన్నారు. ఆయా సమావేశాల్లో సర్పంచ్‌లు చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, గెడ్డం మంగాలక్ష్మి, గుబ్బల దుర్గ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ, మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ, నాయకులు కంకిపాటి సుబ్బారావు, గాడి సత్తిబాబు, పసుపులేటి మహలక్ష్మీరావు పాల్గొన్నారు.

గోశాల ప్రారంభం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయ ప్రాంగణంలో దాత విరాళంతో నిర్మించిన గోశాలను ఆదివారం ప్రారంభించారు. మురముళ్లకు చెందిన చీకట్ల సత్యం, సత్యవతి స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన రూ.6 లక్షల విరాళంతో ఈ గోశాలను నిర్మించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలు, భక్తుల కోలాహలం నడుమ గోశాలను చీకట్ల చిన్నయ్య, ఆదిలక్ష్మి, చీకట్ల నాగేశ్వరరావు, సూర్యకుమారి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గోకులంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్, దాత కుటుంబ సభ్యులు బద్రి యశ్వంత్, లక్ష్మీలాస్య, చీకట్ల సత్యనారాయణ, లక్ష్మీనాగసంధ్య ప్రణయ శ్రీకేష్ పాల్గొన్నారు.